
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

సోమవారం 30 డిసెంబరు 2024



న్యూస్ బాక్స్

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

వేములవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గం పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పలు అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 12 కోట్ల 47 లక్షల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రహదారులు, మురికి కాలువలు వంటి నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ రూ.4 లక్షల నిధులను కేటాయించారని నాయకులు పేర్కొన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, నరేశ్, సంజీవరెడ్డి, వేణు, నర్సయ్య, కిషన్, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గంభీరావుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గంభీరావుపేట మండలంలోని జడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి విద్యార్థినులు జి.కీర్తన, జి.రమ్యశ్రీ, బి.అనూహ్య ఎంపికైనట్లు పాఠశాల పీడీ భాను తెలిపారు. సోమవారం నుంచి వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకటరామరావు విద్యార్థినులను అభినందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బోయినపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లిలో వృద్ధులకు రిటైర్డ్ ఎంఈవో చెన్నమాలవుని లక్ష్మీ రామరాజు దంపతులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ రందర్భంగా గ్రామస్థులు వారిని అభినందించారు.

అభివృద్ధి అంతంతే



- నిధుల కోసం ఎదురు చూపులు
- వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో ముందడుగు
- ప్రారంభంకాని మల్కపేట రిజర్వాయర్
- అందని కొత్తపింఛన్లు, రేషన్‌కార్డులు
- అన్నదాతలకు రుణమాఫీ ఊరట
- రైతు భరోసా కోసం నిరీక్షణ
- మున్సిపాలిటీలు, రెవెన్యూ గ్రామాలతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఒడిదుడుకులు
- నెరవేరిన యారన్ డిపో కల
- రూ.379 కోట్ల బకాయిలు విడుదల
- మిడ్ మానేరు నిర్వాసితులకు చేయూత
- ఆరు గ్యారంటీల ద్వారా రూ.500 కోట్ల లబ్ధి
- రైతులకు రూ.380 కోట్ల రుణమాఫీ



యారన్ డిపోను ప్రారంభించి నూలును అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో ఈ ఏడాది అభివృద్ధి, సంక్షేమం అంతంతమాత్రంగానే సాగాయి. నిధుల కేటాయింపుల కోసం అన్ని శాఖలు ఎదురు చూశాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిధులు లేక అభివృద్ధి అటకెక్కింది. ఆరు గ్యారంటీల్లో సంక్షేమం కొంత మేరకు ఊరటను ఇచ్చినా కొత్త పథకాలు రాలేదు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డులకు నిరీక్షణ తప్పలేదు. అన్నదాతలకు రుణమాఫీ వచ్చినా రైతు భరోసా నిరాశ కలిగించింది. జిల్లాలో ప్రధానంగా వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధిలో ముందడుగు పడిందని, సిరిసిల్ల సెగ్మెంట్ వెనకడుగు వేసిందని విమర్శలు వచ్చాయి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పాత బకాయిల విడుదల మినహా నేతన్నలకు ఊరటనిచ్చే చర్యలు కనపించలేదు. వేములవాడ కేంద్రంగా యారన్ డిపో ఏర్పడింది. నిధులు లేక అనేక అభివృద్ధి పనులు నెమ్మదించాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంలో మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభిస్తారని ఎదురు చూసినా నిరాశ పర్చింది. వేములవాడ కేంద్రంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్వయంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం అందించిన ఆరు గ్యారంటీల ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.500కోట్ల లబ్ధి చేకూరింది. రైతులకు రూ.380 కోట్ల రుణమాఫీ, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.379 కోట్ల బకాయిలు వచ్చాయి. గడిచిపోతున్న 2024 సంవత్సరంలో జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం అంతంత మాత్రమే సాగాయి.

వీటీడీఏ విస్తరణ

జిల్లాలోని పల్లె ప్రాంతాలు పట్టణ సొబగులు దిద్దుకోనున్నాయి. ప్రభుత్వం 13జిల్లాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో విలీనం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిని విస్తరిస్తూ అక్టోబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. వీటీడీఏ పరిధి పెరగడంతో అభివృద్ధి పెరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలు 255 గ్రామ పంచాయతీలు, 152 రెవెన్యూ...

మిగతా 8లో

రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు



ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక హామీల మధ్యే కాలం గడిచిపోగా ఈ సంవత్సరం వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. భక్తులకు సౌకర్యవంతంగా, వేగంగా దర్శనం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. బ్రేక్ దర్శనం అమలు చేశారు. మూలవాగు మీదుగా రాజన్న ఆలయానికి చేరుకునే విధంగా ప్రభుత్వం రూ.127 కోట్ల నిధులు కేటాయించి పనుల్లో వేగం పెంచింది. కోడె మొక్కులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గోశాలల అభివృద్ధికి రూ.66 లక్షలు కేటాయించారు. రూ.43 లక్షలతో సీసీ ఫ్లోరింగ్, రూ.18 లక్షలతో మురికి కాలువలు, రూ.50 లక్షలతో గోశాల షెడ్‌కు నిధులు కేటాయించారు. రూ.35 కోట్ల అంచనాలతో అన్నదాన సత్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు.

సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

8

- సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్
- కొనసాగుతున్న రిలే దీక్షలు



సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో ఉద్యోగులు

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

6

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్నను దర్శించుకున్న పాట్నా హైకోర్టు జడ్జి



వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో భక్తులు

కిక్ బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు

సిరిసిల్ల టౌన్ డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎం కప్ కిక్ బాక్సింగ్ పోటీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులు బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంగారు పతకం సాధించిన ఎండీ అయాన్, కొండ శ్రీరామ్‌ను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అజ్మీరా రాందాస్, కిక్ బాక్సింగ్ కోచ్ వద్నాల శ్రీనివాస్ అభినందించారు. కిక్ బాక్సింగ్ 37 కిలోలు పాయింట్ ఫైట్ విభాగంలో అయాన్ బంగారు పతకం, 42 కిలోల పాయింట్ ఫైట్ విభాగంలో కొండ శ్రీరామ్ కాంస్య పతకాన్ని సాధించారు. క్రీడాకారులను సీఎం ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారులు అభినందించారు.



అభినందిస్తున్న సీఎం ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి

ఆధ్యాత్మిక యాత్రకు బయల్దేరిన భక్తులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్త మండలి సభ్యులు ఆదివారం ఆధ్యాత్మిక యాత్రకు బయల్దేరారు. రెండు ప్రైవేటు బస్సుల్లో సుమారు 80 మంది తరలి వెళ్లారు. మొదట వేములవాడలోని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరి 12న నిర్వహించే గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాలనికి హాజరు కావాలని కోరారు. వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చూడాలని విన్నవించారు. అనంతరం వేములవాడ, కోనరావుపేట మండలాల్లోని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంక్షలు అతిక్రమిస్తే కేసులు : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఆంక్షలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని, వేడుకలను ఆనందంగా నిర్వహించుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, మంగళవారం జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేడుకలకు సంబంధించి ఏర్పాటు చేసే కార్యక్రమాలకు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులకు గురయ్యే విధంగా వ్యవహరించవద్దని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డీజేలు నిషేధమన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్‌లను తీసివేసి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్షంలను అతిక్రమించినవారిపై 100కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరఫున ఎస్పీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాజన్న ఆలయంలో మహా లింగార్చన



లింగార్చన చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా మహా లింగార్చనను అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రాజన్న ఆలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆలయ కల్యాణ మండపంలో రాత్రి అర్చకులు పిండితో దీపాలను తయారు చేసి లింగార్చన నిర్వహించారు.

రోడ్డు విస్తరణ నిలిచినట్లేనా?

- గత ప్రభుత్వంలో రూ.82 కోట్లు మంజూరు
- పాదయాత్రకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ నాయకులు



ప్రతిపాదిత ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లె రోడ్డు

ఇల్లంతకుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఫోర్‌లైన్ ప్రతిపాదిత రోడ్డు పనులు ప్రారంభానికి నోచు కోవడం లేదు. 2020లో అప్పటి సీఎం కేసీఆర్ సిద్దిపేట పర్యటనలో సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట వరకు ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ ద్వారా రూ 250 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈరోడ్డును రెండు భాగాలుగా అధికారులు విభజించారు.

సిద్దిపేట నుంచి అల్లీపూర్ వరకు, అల్లీపూర్ నుంచి ఇల్లంతకుంట వరకు ఫోర్ లైన్ పనులు చేపట్టాలని అధికారులు ప్రాథమిక సర్వే చేపట్టారు. అల్లీపూర్ నుంచి ఇల్లంతకుంట వరకు 10 కిలోమీటర్ల పనులకు రూ .82 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. సిద్దిపేట నుంచి అల్లీపూర్ వరకు పనులు ప్రారంభం కాగా ఇల్లంతకుంట వరకు చేపట్టే పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈరోడ్డు నిర్మాణం జరిగినట్లయితే అన్నపూర్ణ రిజర్వాయర్, వెంకట్రావుపల్లె, ఇల్లంతకుంట ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని ప్రజలు భావించారు. ప్రభుత్వం మారడంతో ప్రతిపాదిత రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడమే కాకుండా నిధులు ఇతర జిల్లాకు మళ్లించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనుల ప్రారంభం కోసం త్వరలో పాదయాత్ర చేయడానికి బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిధులను ఇతర జిల్లాకు మళ్లించారు..



ఇల్లంతకుంట మండలానికి ఫోర్‌లైన్ రోడ్డు కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఇతర జిల్లాకు మళ్లించారు. రోడ్డు విస్తరణతో అన్నపూర్ణ రిజర్వాయర్‌కు పర్యాటక శోభతోపాటు ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని నిధులు మంజూరు చేస్తే ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదు. రోడ్డు దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా కనీసం అంతర్గత రోడ్లకు సైతం నిధులు మంజూరు చేయలేదు. ఫోర్‌లైన్ రోడ్డు పనులు ప్రారంభించాలని, త్వరలోనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేయాలని నిర్ణయించాం.

\- సిద్దం వేణు, మాజీ జడ్పీవైస్ చైర్మన్

ప్రజలను మభ్యపెట్టడానికి మంజూరు హామీ



గత ప్రభుత్వంలో ప్రజలను మభ్యపెట్టడానికే ఫోర్‌లైన్ రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయని ప్రకటించారు. రోడ్డు విస్తరణ కోసం ఎలాంటి నిధులూ కేటాయించలేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పనులు ఎందుకు ప్రారంభించ లేదు. పనులు ప్రారంభించని వాటినటిన్నిటిని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఎమ్మెల్యే సత్యనారాయణ నాయకత్వంలో మంత్రి వెంకటరెడ్డిని కలిసి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు చేపట్టే పాదయాత్రను ప్రజలు నమ్మేస్థితిలో లేరు.

\- వుట్కూరి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ, ఇల్లంతకుంట

భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం కుంభమేళా



వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు

వేములవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించ తలపెట్టిన మహాకుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, స్థానిక నాయకులతో కలిసి వీక్షించారు. మహా కుంభమేళా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు 40 కోట్ల మంది పాల్గొనే అవకాశం ఉందని, హిందువులతోపాటు వివిధ మతాలకు చెందిన వారు పాల్గొనడం విశేషమని ప్రధాని అన్నారు. సుదీర్ఘకాలంగా ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ అన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణస్వామి, మంద రాజేందర్, రవి కిషోర్ పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తే క్రిమినల్ కేసులు

\- డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి - ఆర్ఎంపీ వైద్యుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలిసితెలియని వైద్యంతో ప్రజల ప్రాణాలకు హాని కల్గిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కాశీపల్లెకు చెందిన మహిళ ఖాసింబీ మృతి చెందడంతో వైద్యం చేసిన ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని ఆర్ఎంపీ వైద్యుడు జజ్జరి దేవేందర్‌ను ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. క్లినిక్‌ల పేరిట వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలు ఆర్ఎంపీలను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని సూచించారు. ప్రభుత్వ వైద్య సదుపాయాలు, అర్హత కల్గిన వైద్యులను సంప్రదించాలని, మెరుగైన వైద్యం చేయించుకోవాలని అన్నారు.

కోదండరామస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి ఆనందరావు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, నాయకులు

కోనరావుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట శివారులోని గుట్టపై ఉన్న కోదండ రామస్వామిని మాజీ న్యాయశాఖ మంత్రి చల్మెడ ఆనందరావు ఆదివారం దర్శించుకున్నారు. గుట్టపై రూ.6 కోట్లతో మాజీ ఆనందరావు కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, మహేందర్, శివతేజ, అక్కనపల్లి కరుణాకర్ తదితరులు ఉన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన గెజిటెడ్ అధికారులు



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం కరీంనగర్‌లోని రేకుర్తి హనుమాన్ ఆలయ పరిసరాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులను కేంద్ర మంత్రి అభినందించారు. గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సమర సేన, ప్రధాన కార్యదర్శి జబీ, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, చంద్రకళ, పబ్లిసిటీ కార్యదర్శి కిరణ్‌రావు, సభ్యులు శేఖర్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ చేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి పడిపూజ ఆదివారం సిరిసిల్లలో కన్నుల పండువగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన అయ్యప్ప దీక్షాపరుడు కాసర్ల వెంకటేష్ గృహంలో గురుస్వామి రాచ విద్యాసాగర్‌స్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు విశ్వనాథం, రమేష్‌పూజారి పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

మల్లాపూర్, డిసెంబరు, 29 (ఆంధ్రజ్యోతి): పక్షం రోజుల క్రితం దుబాయ్‌లో జరిగిన బస్సు బోల్తా ఘటనలో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన మానల అశోక్(47) చికిత్స పొందుతూ మరణించగా ఆయన మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. శవపేటికను చూసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. అశోక్ నాలుగు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. బస్సు ప్రమాదంలో మృత్యు వాత పడి విగత జీవిగా మల్లాపూర్‌కు చేరుకోవడంతో విషాద చాయలు అలుముకున్నాయి. అశోక్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కూ తుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివారల ప్రకారం...రాజస్థాన్‌లోని కైలాస్‌నగర్‌కు చెందిన మీనా కిషన్(20) బతుకుదెరువు కోసం మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్‌కు రెండేళ్ల క్రితం వచ్చాడు. గ్రామంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వెళ్లి తిరిగి గ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మీనా కిషన్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడా, మరేదైన వాహనం ఢీకొన్నదా అని దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక మహిళ ఆత్మహత్య

చొప్పదండి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సంకేపల్లి శంకరమ్మ(51) అనే మహిళ ఒంటరితనం భరించలేక ఇంటిలో ఉరివేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. శంకరమ్మ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఇద్దరికి వివాహలు అయ్యాయి. కుమారుడు కరీంనగర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు గోదావరిఖనిలో ఉంటోంది. భర్త శంకరయ్య, కరీంనగర్‌లో కుమారుడి వద్ద ఉంటున్నాడు. శంకరమ్మ చొప్పదండిలో ఉంటున్నది. ఒంటరితనంతోపాటు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శంకరమ్మ కుమారుడు సుంకేపల్లి సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జి శ్రీనివాస్, ఎం సతీష్‌లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏసీ వాహనం ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సులో గుండెపోటుతో వృద్ధుడి మృతి


మృతి చెందిన ఆకుల గంగయ్య

గంగాధర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధరలో ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామానికి చెందిన ఆకుల గంగయ్య (70) ఆదివారం కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లాడు. ఇంటికి చేరేందుకు కరీంనగర్ నుంచి లింగాపూర్ వెళ్లే బస్సు ఎక్కాడు. బస్సు గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా సమీపానికి వచ్చిన గంగయ్య గుండెపోటుకు గురై ఇబ్బంది పడ్డాడు. ప్రయాణికులు గమనించి బస్సు డ్రైవర్‌కు విషయం చెప్పారు. డ్రైవర్ వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బస్సును మళ్లించాడు. ప్రయాణికులు గంగయ్యను పీహెచ్‌సీలోకి తీసుకెళ్లారు. పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో గంగయ్య కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఐతుపల్లికి తీసుకెళ్లారు.

గోదావరిలో దూకి వ్యాపారి ఆత్మహత్య

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో దూకి ఖనికి చెందిన వ్యాపారి నాగవెల్లి సత్యానారాయణ(58) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక మేదరిబస్తీలో పెయింటింగ్ షాప్ నిర్వాహకుడు సత్యనారాయణ మధ్యాహ్నం తన స్కూటీపై గోదావరి బ్రిడ్జి మీదకు వెళ్లాడు. స్కూటీని వదిలి ఆధార్ కార్డు వాహనంపై ఉంచి నదిలో దూకాడు. కొద్దిసేపటికి మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సత్యనా రాయణకు భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. తన భర్త అనా రోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు సత్యనారాయణ భార్య జయప్రద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు టుటౌన్ పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో బాలిక కిడ్నాప్‌నకు యత్నం

జగిత్యాల క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐదేళ్ల బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన దంపతులు తమ ఐదేళ్ల కూతురుతో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్ ప్రాంతంతో పని నిమిత్తం చేరుకున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న హోటల్ వద్ద దంపతులు ఉండగానే తన కూతురుని మద్యం మత్తులో సిరిసిల్లా జిల్లా కేద్రానికి చెందిన నవీన్ అనే యువకుడు అపహరించేందుకు యత్నించాడు. గమనించిన బాలిక తండ్రి అరుపులు పెట్టడంతో స్థానికులు యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన జీవన స్రవంతిలో కలవాలి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీఎస్పీ రాములు

కోరుట్ల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనజీవన స్రవంతిలో కలిసి కటుంబ సభ్యులకు దగ్గర కావాలని మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రా ములు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు తిప్పిరి తిరుపతి కుటుంబ సభ్యులను కలిసి కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న తిరుపతి కుటుంబ సభ్యులను కలిసి నిత్యావ సర సరకులను అందించారు. కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకు న్నారు. పిల్లల చదువులు ఎలా సాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటి సభ్యుడిగా ఎదిగిన తిరుపతి కుటుంబ సభ్యుల పరిస్థితిని గమనించి ప్రభుత్వానికి లోగిపోవాలని ఈ సందరంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేష్‌బాబుతో పాటు ఎస్‌ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒగ్గు కథలతో చైతన్యం

- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారుడు
- తెలంగాణ ఉద్యమంలో ఊరూరా పర్యటనలు
- కరోనా మహమ్మారిపై ప్రదర్శనలు
- ఢిల్లీ వేదికగా ఒగ్గుకథకు గుర్తింపు


ఢిల్లీలో ప్రదర్శన ఇస్తున్న దేవయ్య, బృంద సభ్యులు (ఫైల్)

తంగళ్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒగ్గు కథల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండే పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు దేవయ్య. మండేపల్లి గ్రామానికి చెందిన దేవయ్యకు చిన్నతనం ఒగ్గు కథలంటే ఆసక్తి. తన తాత ఒగ్గు రాజనర్సు నుంచి కథలు చెప్పడం నేర్చుకున్నాడు. సామాజిక అంశాలను ఒగ్గు కథకు జోడించి ప్రదర్శనలు ఇవ్వడం దేవయ్య ప్రత్యేకత.

దాదాపు 20 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఊరూరా తిరుగుతూ ఉద్యమ స్ఫూర్తిని రగిలించాడు. కరోనా కాలంలోనూ వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒగ్గు కథల ద్వారా అవగాహన కల్పించాడు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఒగ్గు కథ ప్రదర్శనలు ఇచ్చాడు. ఆజాదీ కా అమృత్ మహో త్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, సంగీత నాటక ఆకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఎనిమిది మంది ఒగ్గు కథ కళాకారుల బృందంతో ప్రదర్శన ఇచ్చాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంగ్లేయులను గడగడలాడించిన తెలంగాణవాసి రాంజీ గోండు వీరగాథను ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఒగ్గు కథ గుర్తింపును చాటాడు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాల ఒగ్గు కథ మహోత్సవానికి ఆహ్వానం అందు కున్నాడు. గూగుల్ మీట్ ద్వారా ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాడు.

ప్రభుత్వ కార్యక్రమాలతో గుర్తింపు

ఒగ్గు దేవయ్య, కళాకారుడు, మండేపల్లి



ప్రభుత్వ కార్యక్రమాల్లో సామాజిక అంశాలపై ప్రదర్శనలు ఇవ్వడంతో గుర్తింపు వచ్చింది. ఒగ్గు కథకు అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన కళాకారుడు మిద్దె రాములును స్ఫూర్తిగా తీసుకొని ముందు కెళ్తున్నాం. మల్లన్న దేవుడి పట్నాలు ఎక్కువగా వేస్తాం. వ్యవసాయం చేసుకుంటూ ప్రదర్శనలు ఇస్తున్నా.

ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం కేటాయించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ఐదు శాతం వాటా కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ సదరంలో దొర్లిన తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో దివ్యాంగులు బస్సు ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు రెండు, మూడు సీట్లను ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. మహిళ దివ్యాంగుల కోసం జిల్లా కేంద్రంలో వసతి గృహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్హతతో సంబంధం లేకుండా అర్హులైన దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనం మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ఐదు శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగిరి జగదీశ్వంచారి, కాసారంపు పర్శరాములు, ఆకుల చంద్రశేఖర్, అజీజ్, జి పద్మ, బి స్వరూప, ఆర్ అరుణ, నాగరాజు, మహేందర్, పోచమల్లు, జె రాజన్న, కె నాగరాజు, కామెర వెంకటేష్, విష్ణు, తిరుపతి, మల్లేశం, శ్రీనివాస్, ప్రభాకర్, సంపత్ పాల్గొన్నారు.

రూపాయి బిళ్ల పై మన్మోహన్ సింగ్ చిత్రపటం

గొల్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవ పట్నం గ్రామానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, సైకత శిల్పి గాలిపెల్లి చోళేశ్వరా చారి రూపాయి బిళ్ల పై మాజీ ప్రధాని, స్వర్గీయ మన్మోహన్ సింగ్ చిత్ర పటం చిత్రీకరించి ప్రతిభను చాటాడు. మన్మోహన్ సింగ్‌కు రూపాయి బిళ్లపై తన చిత్రం లిఖించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంస్క రణలకు చిహ్నంగానే రూపాయి బిళ్లపై వారి చిత్ర పటంను వేసినట్లు చోళేశ్వరాచారి తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.


రూపాయి బిళ్లపై స్వర్గీయ మన్మోహన్ సింగ్ చిత్ర పటం

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు


రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న పాట్నా హైకోర్టు జడ్జి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు రెండు గంటలపాటు నిరీక్షించారు. అనబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

- కాగా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆదివారం పాట్నా హైకోర్టు జడ్జి జి.అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆమెకు సిరిసిల్ల సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన పూల మొక్కను అందజేశారు. అనంతరం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆమెకు ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి పట్టు వస్త్రాలను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి రాజన్న ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2023 నుంచి అమలు కావలసిన పీఆర్సీ 18 నెలలు ఆలస్యమైందని, వెంటనే ప్రభుత్వం పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 42 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలో కనీసం రెండు డీఏలను ఇవ్వాలన్నారు. 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని, వెంటనే వారిని చర్చలకు పిలవాలని కోరారు. ఆదర్శ పాఠశాలలను పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏరుకొండ నర్సింహాస్వామితోపాటు 33 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మునగాల మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు, పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లాశాఖ అధ్యక్షుడు పటోళ్ల బలవంత్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సోగల సుదర్శన్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జుర్రు నారాయణ, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనుమల్ల రవికుమార్, మహ్మద్ మన్సూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంప చంద్రశేఖర్, కామారెడ్డి జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి ముజీబుద్దీన్, కాంట్లీ గోపాల్, మోహన్, రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో చోరీ

హుజూరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని దమ్మక్కపేట గ్రామ పోచమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. పోచమ్మతల్లి ఆలయాన్ని శుభ్రం చేయడం కోసం శనివారం ఉదయం భద్రయ్య అనే వ్యక్తి వచ్చాడు. ఆలయ ద్వారం తాళం పగలగొట్టి ఉండడంతో స్థానికులకు చెప్పాడు. సుమారు రూ. 1.50లక్షల విలువ గల ఆలయంలోని ఇత్తడి దీపం, కుదురు, ఇత్తడి గంట, 15గ్రాముల అమ్మవారి పుస్తలతాడు చోరీ జరిగినట్లు చెబుతున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన రాఘవపూర్ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పెద్ది శ్రీనిత్య, కుంట ప్రణీత, గాయత్రి ముగ్గురు విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు తెలిపారు. సోమవారం వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పీడీ శైలజ వారిని అభినందించారు. కాగా సీఎం కప్ 2024లో భాగంగా నిర్వహించనున్న కబడ్డీ పోటీలకు పెద్దపల్లి మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వినయ్, నవీన్, నగేష్, అశ్విన్, వినయ్, బాలికల విభాగంలో సాత్విక, అక్షర, లావణ్య, ఎండీ టీనా, వర్షలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య తెలిపారు. వరంగల్‌లో ఈనెల 30 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రంగరావుపేటలో చిరుతపులి కలకలం

- కుక్కలపై దాడి చేసిందని గ్రామస్థుల భయాందోళన


చిరుతపులి పాదముద్రలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రంగరావుపేట గ్రామ శివారులోని వ్యవసాయ చేన్ల వద్ద చిరుత పులి సంచారం కలవరం రేపుతోంది. గ్రామ శివారులోని తాతమ్మ గుడి సమీపంలో రెండు కుక్కలపై దాడి చేసి ఒక్కదాని ఎత్తుకెళ్లగా మరొక్క దాని కళేబరాన్ని ఆదివారం ఉదయం గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థులు తెలిపిన వివారల ప్రకారం..గ్రామానికి చెందిన సంగెపు రమేష్ మొక్కజొన్న తోటలో రెండు పెంపుడు కుక్కలను శనివారం రాత్రి కట్టేసి వెళ్లాడు. వాటిపై చిరుత పులి దాడి చేసి దానిని చంపిందని రైతు రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిరుతపులి ఈడ్చుకెళ్లిన గుర్తులు, పాదముద్రల గుర్తులు కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి సత్తార్ సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ ఉన్న పాదముద్రలు, గుర్తులను పరిశీలించాడు. రాళ్లతో కూడిన మట్టి నేల కావడంతో పాదముద్రలు చిరుతపులివా ? లేక మరేదైనా జంతువా అని గుర్తించడం కష్టంగా ఉందని, ఉన్నత అధికారులతో పూర్తి స్థాయిలో పరిశీలించి ఏ జంతువు అనేది నిర్ధారిస్తామన్నారు. చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో రైతులు తమ పొలాల దగ్గరకు వెళ్లడానికి భయపడుతున్నారు. గొర్రెలు, పశు పెంపకదారులు సైతం సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతపులి బంధించి, ఇతర ప్రాం తాలకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులో తనిఖీలు

జమ్మికుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పిట్టలవాడలో గల బెల్ట్‌షాపులో పోలీస్‌లు ఆదివారం తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రూ.3080 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వ చేసిన బొంగోని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

రాయికల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని త్రికూటాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం చండీ పరివార్, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఊరేగింపు, గణపతి హోమం, అభిషేకం చేయగా, రాత్రి మహా పడిపూజను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మునుగోటి సత్యనారాయణ శర్మ, సాయి సుధీర్ శర్మ, భరత్ శర్మ, స్కందత్, గుడికోట ఆలయ కమిటీ, చండీ పరివార్ సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

వరుస రోడ్డు ప్రమాదాలు

- మూడు రోజుల్లో ఏడుగురికి గాయాలు



హుజూరాబాద్‌లో ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

హుజూరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులోని హనుమకొండ ప్రధాన రహదారిపై కేసీ క్యాంప్ సమీపంలో వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున రాజన్న సిరిసిల్ల జిల్లా ఆదర్శ పాఠశాల విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి వస్తుండగా కేసీ క్యాంపు వద్ద వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఇందులో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అదేరాత్రి శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా గురువారం రాత్రి హుజూరాబాద్ పరకాల క్రాస్ రోడ్ సమీపంలో టాటా ఏసీ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో జూపాక గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. అరగంట సమయంలోనే డిపో క్రాస్ రోడ్ వద్ద డివైడర్‌ను బోలేర వాహనం ఢీ కొట్టడంతో చెల్పూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వరుసగా మూడ్రోజుల్లో నాలుగు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఎన్‌హెచ్-563పై వాహనాల రద్దీ బాగా పెరిగిందని, నేషనల్ హైవే అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎం కప్-2024 జూడో పోటీలు ముగిశాయి. మూడు రోజులుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఈసీ మెంబర్ మహేందర్ చివరిరోజు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు 29 జిల్లాల నుంచి 400 మందికిపైగా క్రీడాకారులు పాల్గొనగా వీరందరికి కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో మూడు రోజులు వసతి, సౌకర్యాలు కలెక్టర్ సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జూడో అసోసియేషన్ మెంబర్స్, టెక్నికల్ అసోసియేషన్ మెంబర్స్, పీఈటీ, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. విజేతలకు హైదరాబాద్‌లో జరగనున్న బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం చేతులమీదుగా పతకాలను, నగదు పురస్కారాలను అందించనున్నారు.

● బాలికల విభాగంలో విజేతలు..

- 48 కేజీల విభాగంలో ఎస్ రమ్య(ఆదిలాబాద్), సీహెచ్ క్రిస్మస్(భద్రాద్రి కొత్తగూడెం), బి నక్షత్ర(హనుమకొండ) గెలుపొందారు.

- 52కేజీల విభాగంలో ఆర్ చాందిని(ఆదిలాబాద్), సావిత్రి(నారాయణపేట), చరిష్మ(యాదాద్రి భువనగిరి)

- 57 కేజీల విభాగంలో కె అలేఖ్య(ఆదిలాబాద్), బి స్పందన(ఖమ్మం), తేజశ్రీ(నిజామాబాద్), 63 కేజీల విభాగంలో ఎన్ శ్రీజ(వరంగల్), వి కావ్య(సూర్యాపేట), వి సాయిప్రీతి(రంగారెడ్డి), 70 కేజీల గ్రిల్స్ విభాగంలో కె రేవతి(వికారాబాద్), ఎ సుష్మిత(కరీంనగర్), కె కృపా(హన్మకొండ)

- 70 కేజీలపై విభాగంలో ఎంఎస్ శివాని(హైదరాబాద్), వెంకట రితిక(కరీంనగర్), కె బ్లెస్సీ(సూర్యాపేట) విజేతలుగా నిలిచారు.

● బాలుర విభాగంలో విజేతలు..

- 50 కేజీల విభాగంలో ఎల్ సతీష్(ఆదిలాబాద్), ఎ రామతేజ(నిజామాబాద్), బి గణేష్(కరీంనగర్),

- 55కేజీల విభాగంలో ఆర్ తరుణ్(ఆదిలాబాద్), పి ప్రశాంత్(భద్రాద్రి కొత్తగూడెం), ఎండీ సుతుద్దిఖాన్(హైదరాబాద్)

- 60 కేజీల విభాగంలో శ్రీహరి(జోగులాంబ గద్వాల్), బి సతీస్ కుమార్(ఖమ్మం), ఎం హర్షవర్ధన్(ఆదిలాబాద్)

- 66కేజీల విభాగంలో కె అఖిల్(జయశంకర్ భూపాలపల్లి), ఆర్ గణేశ్(కరీంనగర్), ఎండీ నసీరుద్దీన్(వరంగల్),

- 66 కేజీల పై విభాగంలో కె సంజీవ్(హైదరాబాద్), బి రవి(మహబూబాబాద్), ఆర్ మధు(ఆదిలాబాద్) విజేతలుగా నిలిచారు.

రాష్ట్రస్థాయి సీఎంకప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో.. ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయ స్థానం



తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీఎంకప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ నెల 27 నుంచి 29 వరకు హన్మకొండలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘ బాధ్యులు పెద్దపల్లి కన్వీనర్ సురేందర్, సిరిసిల్ల కన్వీనర్ జె కృష్ణహరి, జగిత్యాల కన్వీనర్ పెద్దబోయిన శ్రీనివాస్, ప్రేమ్, విద్యాసాగర్, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు డ్రైవింగ్ స్కూల్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

- మూడు వేల మందికి శిక్షణ
- శిక్షణ ఇచ్చేది మహిళే

డ్రైవింగ్ వచ్చి ఉండడం ఇప్పుడు మహిళలకు అవసరంగా మారింది. మోటారు డ్రైవింగ్ స్కూల్స్‌లో పురుషులే ఉండడంతో మహిళలు ఇబ్బందిపడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించాలనుకు అమ్ము మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించారు కరీంనగర్‌కు చెందిన అమ్ము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పోతుగంటి సుజాతరెడ్డి. కరీంనగర్‌లో మూడేళ్లుగా ఒక మహిళా ట్యూటర్‌తో మూడు వేల మందికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి ఉన్న నేపథ్యాన్ని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



శిక్షణ పొందిన మహిళలతో సుజాత రెడ్డి, శిక్షకురాలు స్వప్న

తోటి మహిళల ఇబ్బంది తెలుసుకుని..

నేను 2006లో మోటార్ కారు డ్రైవింగ్ నేర్చుకున్న సందర్భంలో మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో గమనించాను. నాతోపాటు డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చే మహిళల అనుభవాలు, ఇబ్బందులు స్వయంగా తెలుసుకున్నా.. అప్పుడే మహిళ శిక్షకురాలితో ఒక డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించా.. ఆ ఆలోచనను అమలులో పెట్టే క్రమంలో మా స్వచ్ఛంద సంస్థ ద్వారా పరిచయమైన గొల్లపెల్లి స్వప్నకు డ్రైవింగ్ వచ్చన్న విషయం గుర్తుకు వచ్చింది. ఆమె సహాయంతో డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించాను ఎందరో గృహిణులు, డాక్టర్లు, వివిధ స్థాయిల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు, విద్యార్థినులు మా వద్ద డ్రైవింగ్ శిక్షణ పొందారు.

వాహన మెయింటనెన్స్, కార్యాలయ అద్దె, ఇతర ఖర్చులు పోను శిక్షకురాలు స్వప్న అవసరాలు తీరడానికి కొంత ఫీజు తీసుకుంటాం. ఇప్పటి వరకు మూడు వేల మందికి పైగా మా వద్ద డ్రైవింగ్ శిక్షణ పొందారు. మహిళలకు ఉపయోగపడేలా వివిధ వృత్తుల్లో టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ తదితర వృత్తుల్లో శిక్షణ ఇచ్చే కేంద్రాలు కూడా నెలకొల్పాలని ఆలోచిస్తున్నాం.

డ్రైవింగ్ నాకు ఉపాధి కల్పిస్తోంది..

గొల్లపెల్లి స్వప్న, శిక్షకురాలు

ఆసక్తితో నేర్చుకున్న నేను నేర్చుకున్న డ్రైవింగ్ నాకు ఉపాధి కల్పిస్తోంది. మా వద్ద నేర్చుకునే మహిళలకు 20 రోజుల్లో సంపూర్ణంగా డ్రైవింగ్ వస్తుంది. కొందరు నాలు గైదు రోజుల్లోనే నేర్చుకున్నా ప్రాక్టీస్ కోసం 20 రోజులు శిక్షణ ఇస్తాం.



మహిళలందరూ డ్రైవింగ్ నేర్చుకోవాలి..

కరివేద జ్యోతి, గృహిణి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి బైక్, కార్ నడపడం వస్తే బాగుంటుంది. మగవారు ఇళ్లలో ఎప్పుడు అందు బాటులో ఉండక పోవచ్చు. డ్రైవింగ్ వస్తే మహిళలు స్వయంగా వెళ్లి పనులు చేసుకోవచ్చు.



భర్త అనారోగ్యం డ్రైవింగ్ నేర్చుకునేలా చేసింది..

సల్మా ఫాతిమా, గృహిణి

మావారు కేటరింగ్ చేస్తారు. ఆయన రెండు నెలల క్రితం అనారోగ్యానికి య్యారు. ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి ఎవరూ లేరు. దీంతో టూ వీలర్, కారు డ్రైవింగ్ నేర్చుకున్నా.



ధైర్యంగా నేర్చుకుంటున్నాం..

సాహితి, విద్యార్థిని

నేను బీటెక్ చదువుతున్నాను. కాలేజీకి వెళ్లడానికి డ్రైవింగ్ నేర్చుకోవాలనుకున్నా. 15 రోజుల్లోనే టూ వీలర్, కారు డ్రైవింగ్ నేర్చుకున్నా. అమ్ము డ్రైవింగ్ పాఠశాలలో మహిళా శిక్షకురాలు ఉండడం ధైర్యంగా వచ్చి డ్రైవింగ్ నేర్చుకుంటున్నాం.



నేషనల్ లెవల్ యోగాలో ప్రథమ, ద్వితీయ స్థానాలు



పురంశెట్టి స్వర్ణలత

ధర్మారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ లెవల్ యోగా చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో ధర్మారంకు చెందిన పతంజలి యోగా సమితీకి ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. ఇండియన్ యోగా స్కూల్ వారు నిర్వహించిన ఈ పోటీల్లో పతంజలి యోగా సమితి సాధకులు పురంశెట్టి స్వర్ణలతకు ప్రథమ స్థానం, బొమ్మవరం వేణుగోపాల్‌రావుకు ద్వితీయ స్థానం లభించడంతో జిల్లా పతంజలి యోగా సహ ప్రబారి జంగిలి సుధాకర్, ధర్మారం మండల శాఖ మహిళా ప్రబారి మంజుల హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గంగాధర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సయ్యద్ హనీఫా సీఎం కప్ ఖోఖో క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ముగిసిన మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు

» చివరి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు » స్వామివారికి బోనాల సమర్పణ



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్న పేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఆఖరి రోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పోటెత్తింది. జాతర ఉత్సవాలు ఏడు వారాల పాటు వైభవంగా జరిగి ఆదివారం ఘనంగా ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు బెల్లం పానకంతో వం డిన బోనాలను నెత్తిన ఎత్తుకుని శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పిం చారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమం త్రోచ్ఛరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు. అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 39,940 ఆదాయం సమకూరినట్లు ఆల య ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. జాతరలో ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండల వైద్యాధికారి డా. నరేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆల య ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ఈవో విక్రమ్, తాజామాజీ ప్రజా ప్రతినిధులు సిద్దంకి నర్సయ్య, గోస్కుల రాజన్న, భేర కిషోర్, బీఆర్ఎస్వీ మండల శాఖ అధ్యక్షులు ఆవారి చందు, నాయకులు సిద్దం కి మల్లయ్య, భీమ సత్తయ్య, కడమండ సుధాకర్, మామిడిపెల్లి పోచమల్లయ్య, భీమ మహేష్, దాసరి మల్లయ్య, జాతర ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొదటి సారి ఆలయా న్ని సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

మల్లన్న భక్తుల సందడి



ధర్మపురిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు తిరుగు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నదీ వరకు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగనీయకుండా చర్యలు చేపట్టారు. భక్తులు స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మల్యాల: మల్యాల శివారులోని మల్లెగుట్టపై ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మల్లెగుట్ట మల్లన్న సన్నిధిలో పట్నాలు, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన మెట్ల మార్గం, గుట్ట వెనుక బాగం నుంచి ఏర్పాటు చేసిన రహ దారి నుంచి భక్తులు మల్లెగుట్టపైకి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

దాడి సంఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలతో పరస్పరం దాడి చేసుకున్న సంఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ముకరంపుర కు చెందిన అజీమొద్దీన్‌కు అతడి అల్లుడైన షోయబ్‌కు కుటుంబ గొడవలు ఉన్నాయి. ఆదివారం అజీమొద్దీన్ ఇంటికి వచ్చిన షోయబ్ మరో వ్యక్తితో కలిసి దాడి చేసేందుకు యత్నించాడు. వారిని అజీమొద్దీన్ కత్తితో దాడి చేయగా అల్లుడు షోయబ్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ఈ విష యంపై ఇరువురు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నా మని సీఐ తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్విజ్ జోన్-2024 పరీక్షకు స్పందన



క్విజ్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఐవీవై సీబీఎస్ఈ ఉన్నత పాఠశాలలో సిద్ధార్థ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ దాసరి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి క్విజ్ జోన్-2024 ప్రిలిమినరీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ప్రిలిమినరీ విభాగంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠ శాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం పరీక్ష ప్రారంభోత్సవ కార్యక్రమానికి కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు విశిష్ట అతిథిగా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్విజ్ పోటీలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో పోటీతత్వం అలవడు తుందన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయవచ్చని అన్నారు. సాంఘికశాస్త్ర విషయంలో ఎనిమిది సంవత్సరాల నుంచి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ప్రిలిమినరీ రౌండ్ నుంచి ప్రతిభ చాటిన ఎనిమిది గ్రూపులను ఎంపిక చేసి ఫైనల్ రౌండ్ నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి సాగర్, ఐవీవై పాఠశాల చైర్మన్ పసుల మహేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం జరిగేనా..?

● జగన్నాథ్‌పూర్-బోర్నపల్లి గిరిజనులకు కలగానే వారధి ● నిధులు సరిపోక ప్రారంభం కాని పనులు



జగన్నాథ్‌పూర్-బోర్నపెల్లి గ్రామాల మధ్య పెద్దవాగు

రాయికల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథ్‌పూర్-బోర్నపెల్లి గ్రామాలమధ్య వంతెన నిర్మాణం కాక గ్రామస్థుల కల నెరవేరడం లేదు. మావోయిస్టు ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఐఏపీ (ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్) ద్వారా రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్-బోర్నపెల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి 2012-13లో రూ.కోటి నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. వాగుపై వంతెన నిర్మాణం రూ.కోటితో పూర్తి కాదని, నిధులు పెంచాలని నిపుణులు సూచించినా ఇప్పటివరకు ఫలితం లేకపోయింది. నాటినుంచి నేటివరకు ప్రతియేటా వంతెన నిర్మాణానికి నిధులు పెంచాలని ప్రతిపాదనలు పంపినా స్పందన లేకుండా పోతోంది. గతంలో పలుమార్లు హైదరాబాద్ నుంచి చీఫ్ ఇంజనీరు బృందం పర్యటించి వంతెన నిర్మాణానికి నివేదికలు తయారు చేసింది.

రూ.కోటితో పనులు మొదలు పెడితే వంతెన తక్కువ ఎత్తులో నిర్మించాల్సి వస్తోందని వర్షాకాలంలో గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల ప్రయోజనం ఉండదని అధికారులు నివేదిక ఇవ్వడంతో సదరు నిధులు నిలిపివేశారు. బోర్నపల్లి, జగన్నాథ్‌పూర్ రెండు గ్రామాల్లోని గిరిజనుల రాకపోకలకు అనువుగా ఉండే ఈ వంతెనకు ప్రభుత్వం మిగులు నిధులు ఈ ఏడాది ప్రణాళికలో మంజూరు చేస్తే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రెండు గ్రామాల మధ్య ఈ పెద్దవాగులో యేటా వర్షాకాలంలో వాగు దాటుతూ పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

అమలు కాని కేంద్రమంత్రి హామీ

రాయికల్ మండల కేంద్రంలో 2015 మార్చి 2న రాయికల్‌కు వచ్చిన కేంద్ర గిరిజన శాఖమంత్రి దృష్టికి గిరిజన సమస్యలు మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు తీసుకెళ్లగా జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుతో పాటు జగన్నాథ్‌పూర్ వంతెనకు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు ఆచరణకు నోచుకోలేదు.

ప్రతిపాదనలు పంపినా...ఫలితం శూన్యం

పాదం లతరాజు, మాజీ సర్పంచ్, బోర్నపల్లి

ఈ వంతెన నిర్మాణం కోసం నిధులు చాలవని ఇంజనీర్ల బృందం అధిక నిధుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. తూర్పున ఎక్కువ నిధులు వెచ్చిం చి అధికారులు ఈవైపు నిధులు కేటాయించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి గిరిజనుల కష్టాలు తీర్చాలి.



నీరు వచ్చినప్పుడు వాగు దాటలేము

ఆత్రం విజయ సర్పంచ్, జగన్నాథ్‌పూర్

వర్షాకాలంలో పెద్దవాగులోకి నీరు వచ్చినప్పుడు వాగు దాటాలంటే కష్టమే. వాగు దాటేటప్పుడు చాలా మంది గిరిజనులు గల్లంతయ్యారు. ఈ వాగుపై వంతెన నిర్మిస్తే గిరిజనులకు చాలా ఉపయోగం ఉంటుంది. ప్రభుత్వం వంతెనకు నిధులు మంజూరు చేసి గిరిజనుల కష్టాలు తీర్చాలి.



వంతెన నిర్మిస్తే దూరం తగ్గుతుంది..

కొడిపల్లి ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్, బోర్నపల్లి

వంతెన నిర్మిస్తే రెండు గ్రామాల మధ్య దూరం తగ్గి గిరిజనులకు ప్రయాణ భారం తగ్గుతుంది. వాగులో నీరు వస్తే బోర్నపల్లి నుంచి జగన్నాథ్‌పూర్ వెళ్లాలంటే 40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి. అదే వంతెన నిర్మిస్తే కేవలం నాలుగు కిలో మీటర్ల దూరంతో జగన్నాథ్‌పూర్ చేరుకోవచ్చు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలి.



ఎస్‌యూ ఫార్మసీ కళాశాల సహాయ ఆచార్యుడు పల్లె క్రాంతిరాజుకు డాక్టరేట్



పల్లె క్రాంతిరాజు

గణేశ్‌నగర్/ఓదెల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల సహాయ ఆచార్యుడు పల్లె క్రాంతిరాజుకు డాక్టరేట్ పట్టా లభించింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఆచార్యులు జి కృష్ణమోహన్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ మొమోర్డీకా చారన్షియా ఆన్ ఫార్మకొకైనెటిక్స్ అండ్ ఫార్మాకోడైనమిక్స్ ఆఫ్ ఓరల్ హైపో గ్లైసిమిక్ డ్రగ్స్ ఇన్ డయాబెటిక్ ర్యాట్స్' అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టా లభించింది. బహిరంగ మౌఖిక పరీ క్షకు ఎక్జామినర్‌గా కాకతీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు వై నర్సిం హారెడ్డి హాజరుకాగా క్రాంతి రాజు అన్ని ప్రశ్నలకు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ఈ పరిశోధన మధుమేహ వ్యాధిగ్రస్తుల చికిత్సలో ఎంతగానో తోడ్పడుతుందని ఆచార్య వై నర్సింహా రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేస్తూ పీహెచ్‌డీ పట్టా ప్రదానానికి ఆమోదం తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన క్రాంతి రాజును శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య యు ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య యం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీశైలం, విశ్వవిద్యాలయ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. క్రాంతి రాజుకు గతంలో చేసిన డయాబెటిస్ పరిశోధనకు గాను ఒక పేటెంట్ కూడా లభించింది. కాగా క్రాంతిరాజు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఉప్పరపల్లికి చెందిన వ్యక్తి. క్రాంతిరాజుకు డాక్టరేట్ రావడపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి అంతంతే

5వ పేజీ తరువాయి..

గ్రామాలను కలుపుతూ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా వీటీడీఏను మార్చడం అభివృద్ధికి అడుగులు పడుతుందని భావించారు.

అన్నదాతలకు రూ.380 కోట్ల రుణమాఫీ

జిల్లాలో ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీకి సంబంధించి మూడు విడతల్లో చెల్లించింది. 47,977 మంది రైతులకు రూ.381.46 కోట్లు రుణమాఫీ చేసింది. జిల్లాలో 248 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వానాకాలం సీజన్‌కు సంబంధించి 37,398 మంది రైతుల నుంచి 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా రూ.490.13 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. హామీ మేరకు రైతు భరోసా మాత్రం అమలు చేయలేదు.

పెండింగ్ ప్రాజెక్ట్‌లపై దృష్టి

జిల్లాలో సాగునీటి పెండింగ్ ప్రాజెక్ట్‌లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కాళేశ్వరం ప్యాకేజీ 9లో రూ.1180 కోట్లతో ఇప్పటి వరకు 81శాతం పూర్తి చేశారు. మిగతా పనుల కోసం రూ.340కోట్లు కేటాయించారు. ప్యాకేజీ పనులు పూర్తిచేస్తే సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లో 56వేల ఎకరాలు, వేములవాడ నియోజకవర్గంలో కోనరావుపేటలో 30వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 10వ ప్యాకేజీ పనులు రూ.2400 కోట్లతో 90శాతం పూర్తి చేశారు. మిగతా పనులకు రూ.134కోట్లు కేటాయించారు. దీనికి ద్వారా ఇల్లంతకుంట మండలంలో 15వేల ఎకరాలు సాగులోకి రానుంది. 11వ ప్యాకేజీలో 75శాతం పనులు పూర్తి చేశారు. మిగతా పనులకు రూ.152 కోట్లతో పనులు పూర్తి చేయనున్నారు. దీని ద్వారా సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో 32 వేల ఎకరాలకు నూతనంగా సాగునీరు అందనుంది. 22 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుంది. బోయినపల్లిలో 10 వేల ఎకరాలు, ఆయకట్టుకు నీరందుతుంది. 12వ ప్యాకేజీలో రూ.3200 కోట్లతో 94 శాతం పనులు పూర్తి చేశారు. మరో రూ.50 కోట్లతో పనులు పూర్తి చేయనున్నారు. దీని ద్వారా గంభీరావుపేట ముస్తాబాద్ మండలాల్లో 22 వేల ఎకరాలు నూతంగా సాగులోకి రానుంది. మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తి చేసుకొని సిద్ధంగా ఉన్నా ప్రారంభించకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. మిడ్ మానేరు నిర్వాసితులకు చేయూతను అందించే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇళ్లు లేని నిర్వాసితుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు అందించనుంది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం లో మొదటి దశలో 3500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుండగా రూ.236 కోట్ల విలువైన 4696 ఇందిరమ్మ ఇళ్లను నిర్వాసితులకు మంజూరు చేశారు.

నేతన్నకు కాస్త ఊరట

సిరిసిల్ల నేతన్నలకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం క్లాత్ ఉత్పత్తి ఆర్డర్లకు రూ.28.84 కోట్లు అందించింది. గత ప్రభుత్వ హయాంలో రావాల్సిన బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లకు సంబంధించిన బకాయిలు రూ.379 కోట్లు చెల్లించారు. తాజాగా రూ.66 లక్షల మీటర్ల ఆర్వీఎం క్లాత్ ఆర్డర్లు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. స్వశక్తి సంఘాల మహిళలకు రెండు చీరల చొప్పున అందించడానికి కోటి 30 లక్షల చీరల ఉత్పత్తి ఆర్డర్లు కూడా ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. సిరిసిల్ల నేతన్నలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న యారన్ డిపోను రూ.50 కోట్లతో వేములవాడ కేంద్రంగా ఏర్పాటు చేశారు. 90 శాతం క్రెడిట్‌పై కార్మికులకు యారన్ అంది స్తున్నారు. 11,698 మంది కార్మికులకు త్రిఫ్ట్ కింద రూ.36 కోట్లు అందించారు. నేతన్నకు బీమా కింద 43 మందికి రూ.5 లక్షల చొప్పున అందించారు. యారన్ సబ్సిడీ రూ.37 కోట్లు చెల్లించారు.



పచ్చదనం ర్యాలీలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా (ఫైల్)

సంక్షేమ సంబరం

జిల్లాలో ఆరు గ్యారంటీల ద్వారా రూ.500 కోట్ల వరకు లబ్ధి చేకూరింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సంఘాల్లోని 63 లక్షల మందిని వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే స్కూల్ యూనిఫాం కుట్టే పని అందించారు. కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఇల్లంతకుంటలో మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించారు. 12 రకాల వ్యాపార యూనిట్లకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి హామీ ద్వారా 96 వేల జాబ్ కార్డులను అందించారు. మహిళా శక్తి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.61.60 కోట్ల విలువైన 1.64 కోట్ల జీరో టికెట్లపై మహిళలు ప్రయాణం చేశారు. జిల్లాలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా 93,104 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.7.35 కోట్ల సబ్సిడీని జమ చేశారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల జీరో బిల్లుకు రూ.37.50 కోట్లు చెల్లించారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, ఒంటరి మహిళకు ఉపాధి కల్పించేందుకు రూ.5 కోట్ల వ్యయంతో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. 24 మందికి ఉద్యోగాలు అందించారు. కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్లను అందించారు. మత్స్యశాఖ ద్వారా 440 చెరువుల్లో 70.58 లక్షల చేపపిల్లలను వదిలారు. జిల్లాలో పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. భవిష్యత్‌లో ప్రజల అవసరాలను తీర్చే దిశగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వేను చేపట్టారు. 1,92,432 ఇళ్ల సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ చేస్తున్నారు. క్రీడాకారులను ప్రొత్సహించే దిశగా సీఎంకప్ నిర్వహించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యాక్రమాలను చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో 1,07,398 దరఖాస్తులను ఇంటింటి సర్వే చేస్తున్నారు. ప్రభుత్వం సర్కారు పాఠశాలను బలోపేతం చేసేదిశగా ఖాళీల భర్తీకి పూనుకుంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ సెంటర్‌లుగా అభివృద్ధి చేయడంతోపాటు డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టింది. అమ్మఆదర్శ పాఠశాలల కింద 283 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లాలో 136 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, భాషా పండితులు, పీఈటీ పోస్టులు, భర్తీ చేసి నియామక పత్రాలను అందించారు. 455 మంది టీచర్లకు పదోన్నతులు, గ్రూప్ 4 ద్వారా 124 మందికి ఉద్యోగాలు అందించారు.

రేషన్ డీలర్ల నియామకానికి రాత పరీక్ష

వేములవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకానికి ఆదివారం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజేశ్వర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 16 రేషన్ దుకాణాలకు 110 మంది దరఖాస్తు చేసుకోగా, 102 మంది అభ్యర్థులు మాత్రమే హాల్ టికెట్లు తీసుకున్నారని తెలిపారు. ఆదివారం నిర్వహించిన రాత పరీక్షకు ఇద్దరు గైర్హాజరవగా 100 మంది పరీక్షకు హాజరు అయ్యారన్నారు. రాత పరీక్ష మూల్యాంకనం పూర్తయిన తర్వాత అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

వైద్యుల సలహాలు పాటించాలి

వేములవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుండెజబ్బుల విషయంలో వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఆస్పత్రిలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కరోనా వైరస్ తర్వాత కాలంలో గుండెపోటులు సర్వసాధారణం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు మాసాలకు ఒకసారైనా గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో దాదాపు 300మందికి పరీక్షలు నిర్వహించామని మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. ఎస్ఆర్ఆర్ ఆసుపత్రి నిర్వాహకులు శేఖర్, ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇల్లంతకుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విహారయాత్రకు బయలుదేరిన రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు త్రుటి ప్రమాదం తప్పింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు మూడు బస్సులలో శనివారం సాయంత్రం భద్రాచలానికి బయలుదేరారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సమీపంలో రాత్రి బస్సును ఆపి విద్యార్థులు టాయిలెట్‌కు వెళ్లగా వెనుక నుంచి వచ్చిన లారీ బస్సును ఢీ కొట్టింది. బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్సు ముందు నిల్చొని ఉన్న ఉపాధ్యాయుడు ముద్రకోల రాజకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. తల్లిదండ్రులు ఆందోళన చెందుతారని భావించిన ఉపాధ్యాయులు విహారయాత్రను రద్దుచేసి ఆదివారం ఉదయం విద్యార్థులను ఇళ్లకు పంపించారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం రావాల్సిన నాలుగు ఏరియల్స్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అన్న రాజ్యాంగ స్ఫూర్తిని ప్రభుత్వాలు అనుసరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. కార్మికులకు దశలవారీగా సెలవులు, వేతనంతో కూడిన పండుగ సెలవులు, ప్రమాద బీమా రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. హెల్త్ కార్డులను మంజూరు చేయాలన్నారు. పారిశుధ్యం తరలించే వాహనాలకు ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు అజ్జ వేణు, పంతం రవి పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని జీఎన్ కళాశాల క్రీడామైదానంలో సోమవారం సీపీఐ శత జయంతి ఉత్సవాల ప్రారంభ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణ సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు. 1952లో 50 మంది కమ్యూనిస్టు ఎంపీలను పార్లమెంట్‌కు పంపించిన చరిత్ర ఉందన్నారు. 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నెమరు వేసుకొని భవిష్యత్ పోరాటాలను రూపకల్పనకు బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైందన్నారు. ఆ పోరాటంతో 10 లక్షల ఎకరాలు పేదలకు పంచినట్లు చెప్పారు. 3000 వేల గ్రామాలకు విముక్తి లభించిందన్నారు. రాజన్న సిరిసిల్లకు సంబంధించి బద్దం ఎల్లారెడ్డి, సింగిడి భూపతిరెడ్డి ముఖ్యులన్నారు. సిరిసిల్లలో వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు మంద సుదర్శన్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

1న మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు

గొల్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాల హుండీ లెక్కింపు జనవరి 1న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య ఆదివారం తెలిపారు. జగిత్యాల ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమంను చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యతో లింగన్నపేటలో విషాదం



లింగన్నపేటలో రోదిస్తున్న బంధువులు

గంభీరావుపేట డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో హెడ్ కానిస్టేబుల్ బండారి బాలకృష్ణ (34) ఆదివారం ఆత్మహత్య చేసుకోవడంతో స్వగ్రామమైన గంభీరావుపేట మండలం లింగన్నపేటలో విషాదం చోటు చేసుకుంది. అప్పుల బాధతో మొదట కుటుంబంతో కలిసి ఎలుకల మందుతాగిన హెడ్‌కానిస్టేబుల్ అనంతరం ఒంటరిగా గదిలో ఉరేసుకున్నాడు. ఎలుకల మందు తాగిన భార్యా పిల్లలను బంధువులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాలకృష్ణ మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం లింగన్న పేటకు తీసుకొచ్చారు. 12 సంవత్సరాల క్రితం కానిస్టేబుల్‌గా ఎంపికైన బాలకృష్ణ మొదట్లో ముస్తాబాద్‌లో, అక్కడి నుంచి హైదరాబాద్, తర్వాత 17వ బెటాలియన్ సిరిసిల్లకు వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. బాలకృష్ణ తల్లిదండ్రులు రాజు, మల్లవ్వ స్వగ్రామమైన లింగన్నపేటలో ఉండగా, తన భార్య పిల్లలతో సిద్దిపేటలో ఉంటున్నాడు. బాలకృష్ణకు తమ్ముడు చెల్లెలు ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అప్పట్లో బాలకృష్ణ సిద్దిపేటలో ఇల్లు కొనుగోలు చేశాడు. బాలకృష్ణ మృత దేహాన్ని అతడి తమ్ముడు వచ్చేవరకు ఉంచనున్నారు. తమ్ముడు ఉపాధి కోసం బెహరాన్‌లో ఉంటున్నాడు. అన్న మరణ వార్త తెలిసి తమ్ముడు బెహరాన్ నుంచి బయలు దేరాడు. సోమవారం బాలకృష్ణ దహన సంస్కారాలు జరగనున్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ హమీద్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ.2.94 లక్షల విలువైన చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరి శంకర్, నాయకులు ఎడబోయిన ప్రభాకర్, అక్క పెల్లి బాలయ్య, జంగం రాజులు, గుడికాడి బాలయ్య, దేశెట్టి రాజశేఖర్, యండి యదుల్లా, గుడికాడి కుమార్, పెద్దవేణి మల్లయ్య, బంగ్లా రాజాగౌడ్, లక్కం నాంపల్లి, ఎగదండి మహేష్, వినోద్, బంటు ప్రసాద్, చంద్రం యాదవ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట:ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గఫర్, దేవయ్య, నాగరాజు, మల్లేశం, యూసుఫ్, బాబు, మేఘన పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సింగిల్ విండో డైరెక్టర్ మృతి

- పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం

కోనరావుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట సింగిల్‌విండో డైరెక్టర్ పల్లం సత్తయ్య (52) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన సత్తయ్యకు అదే గ్రామానికి చెందిన మహిళతో పరిచయం ఏర్పడింది. మహిళ, ఆమె సోదరుడు తమకు కరీంనగర్‌లో ఇల్లు కొని ఇవ్వాలని బెదిరించారు. దీంతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య సత్తెమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు

సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని జాక్ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని రాష్ట్ర జాక్ అధ్యక్షుడు యాదగిరి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా విద్యాలయాల్లో ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు పరిష్కారం కాదని, ప్రభుత్వం దాటవేసే ధోరణి వీడాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేస్తూ రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల నుంచి ఉద్యోగం చేస్తున్నా ఎలాంటి భద్రతా లేకపోవడం బాధాకరమని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కరీంనగర్ జిల్లా జాక్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేష్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న యాదగిరి

అ'పూర్వ' సమ్మేళనం



సిరిసిల్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రుద్రంగిలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సిరిసిల్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విజ్ఞాన వర్ధిని ఉన్నత పాఠశాలలో 2002-2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సిరిసిల్లలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల వ్యవస్థాపకుడు మందాడి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనర్సయ్య, ఇంతియాజ్, ఆర్గనైజర్లు వేణు, అజీమ్‌పాషా, పల్లవి పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 1984-85 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు మరిపెల్లి అత్తయ్య, కొత్త విఠల్, పీఈటీ లక్ష్మీనారాయణ, చారి, రఘు కిషోర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.